సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 5 । జూన్ । 2025



రెచ్చిపోతున్న మట్టి మాఫియా

ఇరగవరం మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. కొత్తపాడు, రేలంగి, కత్తవపాడు, అయినపర్రు, పేకేరు తదితర గ్రామాల్లో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. 12లో ▸



రూ.31.83 లక్షలు స్వాధీనం

జగన్నాథపేటలో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడి నుంచి చోరీ సొత్తు రూ.31.83 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. 12లో ▸



పర్యావరణాన్ని కాపాడుకుందాం

పర్యావరణాన్ని కాపాడితే అది మనల్ని కాపాడుతోంది. దీని ప్రాముఖ్యతను గుర్తించి ఏటా జూన్ 5న పర్యావరణ పరిరక్షణ అవగాహన దినోత్సవం నిర్వహిస్తున్నారు. 12లో ▸

న్యూస్‌రీల్

సరైన వైద్యంతోనే ఆరోగ్యవంతమైన సమాజం



భీమవరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: సరైన వైద్యంతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమని, దానికి వైద్యాధికారులు, సిబ్బంది కృషి ఎంతో అవసరమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం భీమవరం విష్ణు కళాశాలలో జిల్లా వైద్య, ఆరోగ్య, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మారుమూల ప్రాంతాలలో డెలివరీలు చేయడం, మంచి వైద్య సేవలను అందించడం ద్వారా ప్రజలలో నమ్మకం పొందాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెలివరీకి వైద్యం దొరకదనే సందేహం ప్రజల్లో ఉండకూడదని నొక్కిచెప్పారు. మే నెలలో అత్యధిక డెలివరీలు చేసిన వేల్పూరు, పెనుమంట్ర, మంచిలి, లంకలకోడేరు, పోడూరు పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. కౌమార దశ ఆడపిల్లలకు కిశోర వికాసం పేరిట నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను ఈనెల 20 వరకు కొనసాగించాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి.గీతాబాయి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి బి.సుజాతరాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు 5 కేంద్రాల్లో ఎడ్‌సెట్ పరీక్ష

భీమవరం: జిల్లాలో 5 పరీక్షా కేంద్రాల్లో గురువారం ఎడ్‌సెట్ పరీక్ష నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు జరిగే ఈ పరీక్షకు 427 మంది హాజరు కానుండగా వీరి కోసం పట్టణంలోని విష్ణు ఇంజనీరింగ్, విష్ణు ఉమెన్స్ ఇంజనీరింగ్, భీమవరం డీఎన్నార్ అటానమస్, డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలతోపాటు నరసాపురం స్వర్ణాంధ్ర కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

డీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

భీమవరం: ఈ నెల 6 నుంచి జిల్లాలో నిర్వహించే మెగా డీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. బుధవారం మెగా డీఎస్సీపై కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 6 నుంచి 30 వరకు ఐదు సెంటర్లలో కంప్యూటర్ బేస్డ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 16,634 మంది హాజరు కానున్నారని, పరీక్షల నిర్వహణకు 10 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులను పూర్తిగా తనిఖీ చేసిన తరువాతే అనుమతిస్తామన్నారు.

మండల స్థాయిలో యోగా పోటీలు నిర్వహించాలి

భీమవరం(ప్రకాశంచౌక్): మండల స్థాయి యోగా పోటీలు నిర్వహణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి యోగాంధ్ర 2025 నిర్వహణపై జిల్లా అధికారులు, ఆర్డీవోలు, మండల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంఈఓలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ఒక యోగా ప్రాంగణం గుర్తించాలన్నారు. జిల్లాలో 5 వేలకు పైగా రిజిస్ట్రేషన్‌లు చేయవలసి ఉండగా ఇప్పటివరకు 1,400 మాత్రమే రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారని, మిగిలిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని అన్నారు.

రేషన్ పంపిణీ సక్రమంగా జరగాలి

భీమవరం: రేషన్ డీలర్ల ద్వారా నిత్యావసరాల పంపిణీలో కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నిత్యావసరాల పంపిణీ, రీ సర్వేలో మొదటి విడత పైలెట్ గ్రామాల పురోగతి, కౌలు రైతు కార్డుల నమోదు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ వృద్ధులు, వ్యాధిగ్రస్తులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే డీలర్ ద్వారా అందజేయాలన్నారు. రేషన్ షాపుల దగ్గర కార్డుదారుల సౌకర్యార్థం టెంట్లు, తాగునీరు, కుర్చీలు ఏర్పాటు చేయాలని సూచించారు. మొదట విడత రీసర్వే పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్న జిల్లాలో 20 గ్రామాలకు సంబంధించి సర్వే పూర్తిచేసి నోటిఫికేషన్ ఇచ్చామన్నారు.

వంచనపై గర్జన

- ‘వెన్నుపోటు దినం’ నిరసనలకు అనూహ్య స్పందన
- కూటమి దగాపై కదం తొక్కిన జనం
- నియోజకవర్గ కేంద్రాలకు భారీగా తరలి వచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు
- నిరసన ర్యాలీలు, ధర్నాలు, అధికారులకు వినతిపత్రాలు అందజేత

ఎన్నికల హామీలను గాలికొదిలి చంద్రబాబు సర్కారు చేస్తున్న మోసాలు, అరాచకాలపై జనాగ్రహం పెల్లుబికింది. వైఎస్సార్‌సీపీ పిలుపునిచ్చిన ‘వెన్నుపోటు దినం’కు అనూహ్య స్పందన వచ్చింది. మండుటెండను లెక్కచేయకుండా భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు, ప్రజలు కూటమి దగాపై కదం తొక్కారు. ర్యాలీలు, నిరసనలతో హోరెత్తించారు. ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అధికారులకు వినతులు అందజేశారు.



తణుకు అర్బన్ : తణుకులో భారీ ర్యాలీగా వెళుతున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



నరసాపురం : నరసాపురంలో నిరసన ర్యాలీలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు



పెనుగొండ: ఆచంటలో భారీ ర్యాలీగా వెళుతున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

సాక్షి, భీమవరం: వెన్నుపోటు దినం వేదికగా కూటమి ఏడాది పాలనపై ప్రజల్లోని వ్యతిరేకత బుధవారం సుస్పష్టంగా కనిపించింది. మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపునందుకుని సూర్యప్రతాపం, ఉక్కపోతను ఖాతరు చేయకుండా పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, పేదవర్గాలు జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు చేరుకుని తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ మంత్రులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, కొట్టు సత్యనారాయణ, వెన్నుపోటు దినం ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ నవుడు వెంకటరమణ, పాలకొల్లు ఇన్‌చార్జి గుడాల గోపి, మహిళ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గూడూరి ఉమాబాల తదితరులు మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనపై జనాగ్రహానికి వెన్నుపోటు దినం ఘన విజయం సాధించడమే నిదర్శనమన్నారు. ఎన్నికల ముందు హామీలివ్వడం, అధికారంలోకి వచ్చాక వాటికి గాలికొదిలేసి మోసం చేయడం చంద్రబాబు నైజమని విమర్శించారు. ఇప్పుడు దానినే రిపీట్ చేశారన్నారు. చెప్పినవి చేయకపోగా ప్రజా సంక్షేమం కోసం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన పథకాలను నిలిపేసి రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు తదితర అన్ని వర్గాల వారిని ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ చార్జీలు, నిత్యావసరాల ధరలను పెంచేశారని, ఇంటింటికి రేషన్ రద్దు చేశారని, విపక్ష పార్టీ కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేయడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

వంచనపై సమాధానం చెప్పాలి: ముదునూరి

నరసాపురం: వైఎస్సార్‌సీపీ హయంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పులు చేసి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అబద్ధపు ప్రచారాలు చేసిన కూటమి సర్కార్ ఇప్పుడు నెలనెలా అప్పులు చేస్తూ అటు సంక్షేమం, ఇటు అభివృద్ధి రెండింటిని పక్కన పెట్టి రాష్ట్ర ప్రజలను ఎందుకు మోసం చేస్తున్నారో సమాధానం చెప్పాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు డిమాండ్ చేశారు. నరసాపురంలో వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా నిరసన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి పార్టీ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం ముదునూరి మాట్లాడుతూ.. ‘పోలవరం ప్రాజెక్ట్ ఊసే లేకుండా చేశారు. జగనన్న కాలనీలో నిరుపేదకుల ఇళ్లస్థలాలు ఇస్తే, నేడు ఆ కాలనీల అభివృద్ధిని ఎండమావి చేశారు. నీకు 15వేలు, నీకు 15వేలు అంటూ ఊదరగొట్టి మహిళలను మోసం చేసిన కూటమి నేతలు నేడు మాట్లాడడం లేదు. మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 ఇస్తామని మోసం చేశారు. అమ్మఒడి పథకం ఎగ్గట్టారు. విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి, ఏడాదిలోనే వేల కోట్ల భారం మోపారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి లేదు. అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన ఎగ్గొట్టారు. అక్రమ కేసులు పెడుతూ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు.’ అని దుయ్యబట్టారు.

చంద్రబాబుది వెన్నుపోటు రాజకీయం: కారుమూరి

తణుకు అర్బన్: సంక్షేమం, అభివృద్ధి పథంలో ఏపీని నడిపిస్తానంటూ హామీలు గుప్పించిన చంద్రబాబు ప్రజలకు వెన్నుపోటు పొడిచారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసనలో ఆయన మాట్లాడారు. జగన్ హయాంలో ముసలమ్మ బటన్ నొక్కుతుందని చంద్రబాబు హేళన చేశారని, కూటమి ప్రభుత్వం రాగానే ముసలోడు గట్టిగా నొక్కేస్తాడేమో అని ప్రజలు ఆశపడ్డారని కానీ అసెంబ్లీకి వెళ్లి ఇవన్నీ చూస్తుంటే నాకు భయం వేస్తుందని అనడం ఆయన చేతకానితనానికి నిదర్శనమన్నారు. చంద్రబాబుకు వెన్నుపోటు వెన్నతో పెట్టిన విద్య అని, రైతు భరోసా లేదు, ఫీజురీయింబర్స్‌మెంట్ లేదు, ధాన్యం డబ్బు వేయలేదు, బీమా లేదు, తల్లికి వందనం వేస్తానని, ఉచిత బస్సు ఇస్తానని చెప్పి ఏడాది గడిచినా ఇవ్వలేదు అని నిలదీశారు. ఎండీయూ ఆపరేటర్లకు వెన్నుపోటు పొడవలేదా అని ప్రశ్నించారు. తణుకు ఎమ్మెల్యే పశువధ శాలలో మూగజీవాలను బలి ఇస్తుంటే, స్థానికంగా ఉండలేకపోతున్నామని మహిళలు మొరపెట్టుకున్నా డబ్బుకోసం ఫ్యాక్టరీ యాజమాన్యానికి సహకరించడం వెన్నుపోటు కాదా అన్నారు. ఏ పనిచేయాలన్నా కమిషన్, తణుకులో ఆర్‌కే ట్యాక్స్ విచ్చలవిడిగా అమలవుతుందని చెప్పారు. తణుకులో ఏ పని జరగడం లేదని ప్రజానీకం అల్లాడుతున్నారని, టీడీపీ కార్యకర్తలు సైతం తిడుతున్నారని దుయ్యబట్టారు.

నియోజకవర్గాల్లో నిరసన జ్వాలలు

- పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు ఆధ్వర్యంలో నరసాపురంలో వెన్నుపోటు దినం విజయవంతంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు రెండు కిలోమీటర్ల మేర భారీ నిరసన ప్రదర్శన సాగింది. వాగ్దానాల అమలుకు అధికారులకు వినతిపత్రం అందజేశారు. పార్టీ సీజీసీ సభ్యుడు పీడీ రాజు తదితరులు పాల్గొన్నారు.
- మాజీ మంత్రి కారుమూరి ఆధ్వర్యంలో తణుకు రాష్ట్రపతి రోడ్డులోని చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి నరేంద్ర సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేశారు. ధర్నా అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఎండీయూ వాహన ఆపరేటర్లు ర్యాలీకి మద్దతు పలికారు.
- మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం పార్టీ కార్యాలయం నుంచి హెడ్‌పోస్టాఫీస్ రోడ్డు, కేఎన్ రోడ్డు మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు ఫ్లకార్డులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కూటమి వైఫల్యాలపై ధర్నా చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు.
- మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో ఆచంట నియోజకవర్గం తూర్పుపాలెంలోని పార్టీ క్యాంపు కార్యాలయం నుంచి ఆచంట వరకు పార్టీ శ్రేణులు భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి వినతిపత్రం అందజేశారు.
- భీమవరంలో పట్టణంలోని ప్రకాశంచౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ నవుడు వెంకటరమణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి, జిల్లా అధికార ప్రతినిధి కామన నాగేశ్వరరావు, ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు, అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, ప్రజలు పాదయాత్ర చేసి వినతిపత్రం అందజేశారు.
- పాలకొల్లు ఇన్‌చార్జి గుడాల గోపీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ మూడు కిలోమీటర్ల మేర భారీగా పాదయాత్ర చేశారు. సీనియర్ నాయకులు గుణ్ణం నాగబాబు, చెల్లెం ఆనంద ప్రకాష్, యడ్ల తాతాజీ తదితరులు పాల్గొన్నారు.
- ఉండిలోని వెన్నుపోటు దినం నిరసనలో పార్టీ నరసాపురం పార్లమెంట్ అబ్జర్వర్ మురళీకృష్ణంరాజు, మహిళ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఉమాబాల, ఆకివీడు నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు భారీ ర్యాలీగా తహసీల్దార్ కార్యా లయానికి చేరుకుని వినతి పత్రం అందజేశారు.

ప్రజలకు వెన్నుపోటు

కవురు శ్రీనివాస్

భీమవరం: భీమవరంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వెన్నుపోటు దినం సందర్భంగా ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఎన్నికల్లో నోటికొచ్చినట్లు హామీలిచ్చి అధికారం చేపట్టాక అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. ఆరుగాలం రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించకపోవడమే కాకుండా ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి నెలలు గడుస్తున్నా సొమ్ములు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ కంటే మిన్నగా సంక్షేమ పథకాలు అందిస్తామని గొప్పలు చెప్పిన కూటమి నాయకులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలకే దిక్కులేకుండా చేశారని దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వానికి ప్రజలకు తగిన గుణపాఠం చెబుతున్నారని, తమను వెన్నుపోటు పొడిచిన వారిని ప్రజలను మర్చిపోరని కవురు అన్నారు.



భీమవరం: భీమవరం ర్యాలీలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, నాయకులు



తాడేపల్లిగూడెం అర్బన్: వినతిపత్రం ఇస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ



ఆకివీడు: ఉండిలో ర్యాలీలో గూడూరి ఉమాబాల, ముదునూరి మురళీకృష్ణంరాజు



పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లులో గుడాల గోపి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

మామకే కాదు ప్రజలకూ వెన్నుపోటు

కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: మామకే కాదు ప్రజలను వెన్నుపోటు పొడిచిన పోటుగాడు చంద్రబాబునాయుడని.. వెన్నుపోటు ముఖ్యమంత్రిగా నిలిచాడని మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. వెన్నుపోటు దినం కార్యక్రమంలో బుధవారం మాట్లాడుతూ 143 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయినా ఒక్క హామీని అమలు చేయకపోవడం చంద్రబాబు అవినీతి పాలనకు నిదర్శనమన్నారు. ఏడాది కాలంలోనే రూ.1.51 లక్షల కోట్లతో పాటు ఈ నెలలో మరో రూ.7 వేల కోట్లు రుణం తీసుకున్న అసమర్థుడన్నారు. రెడ్ బుక్ పాలన అంటూ ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత 190 మంది హత్యకు గురయ్యారన్నారు. తెదేపా ప్రభుత్వం అరాచకాలను కొన్ని పత్రికలు, చానళ్లు మాత్రమే రాస్తున్నాయని, వారిని పలు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. యూనిట్ రూ.2.90కు కొనుగోలు చేయాల్సిన కరెంటును రూ.4.60కు కొనుగోలు చేయడం దారుణమన్నారు.

రేషన్ కోసం పాట్లు



బుట్టాయగూడెం మండలం లంకపాకల నుంచి రేషన్ బియ్యాన్ని మోసుకెళ్తున్న కొండరెడ్డి గిరిజనులు

బుట్టాయగూడెం: కూటమి ప్రభుత్వం ఇంటి వద్దకు రేషన్ పంపిణీని రద్దు చేయడంతో మళ్లీ ప్రజలకు బియ్యం మోసే అవస్థలు మొదలయ్యాయి. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో కిలోమీటర్ల మేర కాలినడకన నడుచుకుంటూ బియ్యం మూటలను మోసుకుని తీసుకెళ్లాల్సి వస్తోంది. మండలంలోని మారుమూల గ్రామమైన రేగులపాటుకు చెందిన కొండరెడ్డి గిరిజనులు బుధవారం లంకపాకలలో ఏర్పాటు చేసిన రేషన్ డిపోకు వచ్చి పడిగాపులు కాచి రేషన్ బియ్యం మూటలను తలపై పెట్టుకుని తీసుకెళ్లారు. పలు గ్రామాలకు చెందిన ప్రజలు గత ప్రభుత్వంలో అందించిన సేవలను గుర్తు చేసుకుంటున్నారు. గతంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఒకటో తేదీనే ఎండీయూ వాహనాల్లో ఇళ్ల వద్దకే రేషన్ సరుకులు అందించేవారంటున్నారు. పాత పద్ధతి కొనసాగిస్తే మేలు జరుగుతుందని రేషన్ డిపోల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండదని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు కారం రాఘవ అన్నారు.

విద్యాసంస్థల ఫీజుల దోపిడీ అరికట్టాలి



డీఈవో నారాయణకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

భీమవరం: కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడుతు జిల్లాలో విద్యాహక్కు చట్టాన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు తుంగలో తొక్కుతున్నాయని చట్టం ప్రకారం ప్రభుత్వం ముద్రించిన పుస్తకాల ద్వారా మాత్రమే చదువు చెప్పాలనే నిబంధనలున్నా.. ప్రైవేటు పాఠశాలలు సొంతంగా పుస్తకాలు ముద్రించి వేలకు వేలు వసూలు చేస్తున్నాయన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని, పుస్తకాలు, దుస్తులు విక్రయాన్ని అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు కొన్ని ప్రాంతాల్లోని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఎస్.లక్ష్మణ్, కె.గోవింద్, ఎన్.సాయి ఫణికుమార్, కె.రోహిత్, పి.సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాల్య వివాహాన్ని అడ్డుకున్న ఐసీడీఎస్ అధికారులు



బాలికను తణుకు బాల సదన్‌కు తరలించిన ఐసీడీఎస్ అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్ : మండలంలోని ఎల్.అగ్రహారం రాజీవ్ గృహకల్ప సముదాయంలో బుధవారం రాత్రి జరగాల్సిన బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరపల్లి గ్రామానికి చెందిన బాలికకు, దేవరపల్లి మండలం బంధపురం గ్రామవాసితో బుధవారం రాత్రి బాలిక అమ్మమ్మ స్వగ్రామం ఎల్.అగ్రహారం రాజీవ్ గృహకల్ప సముదాయంలో వివాహం చేసేందుకు సిద్ధమయ్యారు. దీనికి సంబంధించి 1098 నెంబరుకు కాల్ రావడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే దుర్గాభవాని, కే విశాలాక్షి, మహిళా పోలీస్, అంగన్‌వాడీ కార్యకర్తలు బాలిక అమ్మమ్మ ఇంటికి చేరుకుని తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం బాలికను తణుకులోని బాలసదన్‌కు తాత్కాలిక వసతి నిమిత్తం తరలించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే దుర్గాభవాని తెలిపారు.

6 నుంచి హాకీ పోటీలు

భీమవరం: భీమవరం పట్టణంలోని డీఎన్నార్ కళాశాల ఆవరణలో ఈనెల 6వ తేదీ నుంచి 15వ హాకీ ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఉమెన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కలిదిండి ఆనందరాజు, కేవీఎస్ భరత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. రాష్ట్రంలోని 15 టీమ్‌లు పాల్గొంటాయని, విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు ఆగస్టులో కాకినాడలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు టీమ్‌ను ఎంపిక చేస్తామన్నారు.

సుజుకి న్యూ యాక్సెస్ 125 విడుదల



న్యూ యాక్సెస్ 125ను లాంచ్ చేస్తున్న శేషు

ఏలూరు (టూటౌన్): శ్రీ కృష్ణా సుజుకి ఆధ్వర్యంలో హోటల్ ఎన్ ఏలూరులో న్యూ యాక్సెస్ 125 టీఎఫ్‌టీ కలర్డ్ డిస్‌ప్లే వేరియంట్ ద్విచక్ర వాహనాన్ని విడుదల చేశారు. అధునాతన ఫీచర్లతో దీనిని లాంచ్ చేశారని, దీనికి ఏడేళ్ల ఎక్స్‌టెండెడ్ వారంటీ ఉందని, వంద మంది లక్కీ విన్నర్లతో పాటు గ్యారంటీ రివార్డుగా రూ.5 వేలు అందిస్తున్నామని శ్రీ కృష్ణా గ్రూప్స్ అధినేత నారా శేషు తెలిపారు. కార్యక్రమంలో సుజుకి కంపెనీ సేల్స్ అండ్ సర్వీస్ రీజనల్ మేనేజర్లు శివరామకృష్ణ, సునీల్, ఏరియా సేల్స్ మేనేజర్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్ట్

భీమవరం: భీమవరం మండలం, పట్టణంలో నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్‌పై ఎక్సైజ్ అధికారులు దాడి చేశారు. బెల్ట్‌షాప్ నిర్వాహకుడు సీహెచ్ శ్రీనును అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 6 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ కె.బలరామరాజు బుధవారం తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు పి ఉమామహేశ్వరరావు, పి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం
- ఈ ఏడాది నినాదం.. ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఓడిద్దాం
- కొల్లేరు అభయారణ్యంలో పర్యావరణం మృగ్యం
- జిల్లాలో పర్యావరణంపై అవగాహన సదస్సులు





పర్యావరణానికి నిలయంగా కొల్లేరు అభయారణ్యం



ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న స్వీప్ బృందం (ఫైల్)

కైకలూరు: పర్యావరణాన్ని కాపాడుకుంటే అది మానవాళిని కాపాడుతోంది. దీని ప్రాముఖ్యతను ప్రపంచ దేశాలు గుర్తించాయి. స్వీడన్‌లో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో 1972 జూన్ 5న పర్యావరణ పరిరక్షణ అవగాహన సమావేశం జరిగింది. అప్పటి నుంచి ప్రతి ఏటా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 2022 జూన్ 5తో ప్రపంచ పర్యావరణ సంబరాలకు 50 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ ఏడాది ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఓడిద్దాం అనే నినాదంతో యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం(యూఎన్‌ఈపీ) జరుగుతుంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల వ్యాప్తంగా పలు స్వచ్ఛంద సంస్థలు పర్యావరణంపై అవగాహన సమావేశాలు నిర్వహించనున్నాయి. పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మొక్కలు నాటే కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది.

కొల్లేరులో పర్యావరణానికి విఘాతం

రెండు తెలుగు రాష్ట్రాల్లో గుర్తించిన ఏకైక చిత్తడి నేలల ప్రాంతం కొల్లేరు. ఇక్కడ పర్యావరణం నచ్చడంతో వలస పక్షులు లక్షలాదిగా ప్రతి ఏటా తరలివస్తున్నాయి. కొల్లేరు సరస్సు 901 చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉంది. కొల్లేరు అభయారణ్యంగా 5వ కాంటూరు వరకు 77,138 ఎకరాలను గుర్తించారు. కొల్లేరు సరస్సుకు పెలికాన్, పెయింటెడ్ స్టోర్క్, ఐబీస్, స్టిల్ట్ వంటి 185 రకాల జాతుల పక్షులు సంచరిస్తాయి. ఇంతటి ప్రాధాన్యత కలిగిన సరస్సు కాలుష్యపు బారిన పడింది. ఫ్యాక్టరీల నుంచి విడుదలయ్యే వ్యర్థ జలాలతో సరస్సు ఉనికిని కోల్పోతుంది. సహజ సిద్ధ చేపలు మృత్యువాత పడుతున్నాయి. అక్రమ చెరువుల్లో రసాయనాల వాడకం కొల్లేరు పర్యావరణానికి విఘాతం కలుగుతోంది.

ప్లాస్టిక్ బాంబులు

ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్య ప్లాస్టిక్ వాడకం. ప్రతి సంవత్సరం 19–23 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు జల పర్యావరణ వ్యవస్థలో చేరుతున్నాయని అంచనా. 1950లో 2 మిలియన్ టన్నుల నుంచి నేడు 430 మిలియన్ టన్నులకు ప్లాస్టిక్ వాడకం పెరిగింది. ప్రధానంగా మైక్రో ప్లాస్టిక్ సముద్ర జలాల్లో చేరడం వల్ల తాబేళ్లు, తిమింగళాలతో పాటు అరుదైన సముద్ర జీవులు మృత్యువాత పడుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మన రాష్ట్రంలో మాత్రం ప్రమాదకర క్యారీ బ్యాగులను నియంత్రించలేకపోతున్నారు.

అమలుకు నోచుకోని నిబంధనలు

క్యారీ బ్యాగుల నిషేధం చట్టం పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. ఈ చట్టం అమలు కోసం నియమించిన జిల్లా స్థాయి కమిటీల్లో కలెక్టర్లు, మేయర్లు మున్సిపల్ చైర్మన్లు, మున్సిపల్ కమిషనర్లు, పొల్యూషన్ బోర్డ్ అధికారులు, పరిశ్రమల సంస్థ బాధ్యులు, జిల్లా పంచాయతీ అధికారి సభ్యులుగా ఉంటారు. గ్రామస్థాయిలోనూ కమిటీలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఈ కమిటీల ఊసే లేదు. దాడులు కూడా స్వల్పంగా జరుగుతున్నాయి. ఎవరైనా కోర్టుల్లో పిల్ వేసినప్పుడు మాత్రం హడావుడి చేసి తర్వాత పట్టించుకోవడం లేదు.

క్యారీ బ్యాగుల నిషేధం ఏదీ

120 మైక్రాన్‌ల మందం కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ సంచులు నిషేధం. తయారీదారులు ప్రతి క్యారీ బ్యాగ్‌పై చిరునామాతో పాటు రీసైకిల్ చేసిన ప్లాస్టిక్, అసలు ప్లాస్టిక్ వివరాలను ముద్రించాలి. సహజ చాయ తెలుపు రంగులో కవర్లను మాత్రమే వాడాలి, ఈ నిబంధన అతిక్రమించిన తయారీదారులకు రూ.25 వేల నుంచి రూ.50,000, చిల్లర వ్యాపారులకు రూ.2,500 నుంచి రూ.5,000, బహిరంగ ప్రదేశాల్లో ప్లాస్టిక్ సంచులను పారవేస్తే రూ.250 నుంచి రూ.500 వరకు జరిమానా విధించాలి. ఇవి నామమాత్రంగా అమలవుతున్నాయి.

సామాజిక బాధ్యతగా భావించాలి



పర్యావరణ పరిరక్షణ అనేది ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలి. ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనే పర్యావరణ పరిరక్షణకు మార్గం. ప్రతి ఒక్కరూ ఆ దిశగా అడుగులు వేయాలి. ప్లాస్టిక్ సంచులు వాడటం వాటి వల్ల వచ్చే అనర్థాలను ప్రజల్లో అవగాహన కలిగించాల్సినటువంటి బాధ్యత అందరిపైన ఉంది. విద్యార్థులకు కళాశాల స్థాయిలో అవగాహన కలిగిస్తున్నాం.

– డాక్టర్ ఎం.హరిప్రసాద్, అధ్యాపకుడు, వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కైకలూరు

కాటన్ బ్యాగుల వినియోగం బెటర్



జూట్ పేపర్ కాటన్ బ్యాగులు మాత్రమే ఉపయోగించాలి. ప్లాస్టిక్ అనర్థాలపై ప్రధాన కూడళ్ల వద్ద ప్రచార బోర్డులు, బ్యానర్లను ఏర్పాటు చేయాలి. మున్సిపల్, పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలి. దుకాణదారుల్లో క్యారీ బ్యాగులు వాడటం వల్ల అనర్థాలపై అవగాహన కలిగించాలి. ప్రజలను పూర్తిగా భాగస్వామ్యం చేయాలి.

– పి.పవన్‌కాంత్, స్వీప్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, కైకలూరు

భూమిలో విచ్ఛిన్నమవడానికి ఎంత సమయం..

- న్యూస్ పేపర్ 4 నుంచి 6 వారాలు.
- సిగరెట్ చివర ఫిల్టర్ మొన ఒకటి నుంచి 5 సంవత్సరాలు.
- క్యారీ బ్యాగు 10 నుంచి 20 సంవత్సరాలు.
- స్టీల్ టీం క్యాన్ 50 సంవత్సరాలు.
- శీతల పానీయాల అల్యూమినియం బాటిల్ 80 నుంచి 200 సంవత్సరాలు.
- ఫ్రిజ్‌లోని ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు 450 సం.లు
- గాజు బాటిళ్లు (బీరు సీసాలు) మిలియన్ సంవత్సరం.

హామీలను అమలు చేయకుండా మోసం



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు విమర్శించారు. స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత జగన్ ప్రభుత్వం ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తే నేటి కూటమి ప్రభుత్వం పెన్షన్ మినహా ఏదీ నెరవేర్చలేదన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులపై దాడులు చూస్తుంటే రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలులో ఉన్నట్లుగా ఉందన్నారు. పిఠాపురంలో దళితులను అగ్రవర్ణాలు వారు వెలివేస్తే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించలేదని, ఈ ప్రభుత్వం దళిత వ్యతిరేక ప్రభుత్వమని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వెన్నుపోటు కార్యక్రమం విజయవంతంగా జరిగిందన్నారు. సమావేశంలో మాల సంఘాల జేఏసీ నాయకులు గంట సుందర్ కుమార్, కేసీ రాజు, ఎం.ఎస్తేర్ రాణి పాల్గొన్నారు.

వరాల వెంకన్న కల్యాణోత్సవాలు ప్రారంభం



కల్యాణోత్సవాలలో భాగంగా స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరిస్తున్న దృశ్యం



పసుపు దంచుతున్న మహిళా భక్తులు



విశేష అలంకరణలో స్వామివారు

అత్తిలి: మండలంలో ఈడూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీవరాల వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున భక్తులచే గోవింద మాలా దీక్ష స్వీకరణ కార్యక్రమం జరిగింది. సన్నిధి నాగ వెంకట సత్య సూర్య రామలింగేశ్వరరావు, వీర పద్మ, మామిడిపల్లి రాంబాబు, నాగమణి దంపతులచే స్వామివారికి సుప్రభాత సేవ, మేలుకొలుపు, తోమాల సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం వరాల వేంకటేశ్వర స్వామి వారిని పెండ్లి కుమారునిగాను, శ్రీ దేవి భూదేవి అమ్మవార్లను పెండ్లికుమార్తెలుగా అలంకరించారు. పడాల వెంకటేశ్వరరావు దంపతులు శేషవస్త్రాలు సమర్పించారు. అల్లూరి సత్యనారాయణరాజు సుబ్బలక్ష్మి, అల్లూరి సీతారామరాజు, మీనాక్షి దంపతులచే ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో విష్వక్సేనపూజ, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన, గరుడ హోమం, ప్రధాన హోమ పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల వెంకట నారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

- అధికార పార్టీ అండదండలతో విర్రవీగుతున్న భూబకాసురులు
- ముడుపుల మత్తులో జోగుతున్న అధికారులు



రేలంగిలో మట్టి తరలించేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు



కొత్తపాడులో చెరువు పూడిక కోసం తొలగించిన కొబ్బరి చెట్లు



కంతేరులో చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న దృశ్యం

ఇరగవరం: మండలంలోని పలు గ్రామాల్లో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. అధికారులు, అధికార పార్టీ నాయకుల అండ దండలతో విర్రవీగుతూ మట్టిని తరలిస్తున్నారు. ఇరగవరం మండలంలోని కొత్తపాడు, రేలంగి, కత్తవపాడు, అయినపర్రు, పేకేరు, రేలంగి, పొదలాడ గ్రామాల్లో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. వీటిని అదుపు చేయాల్సిన రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ పట్టించుకోవడం లేదు.

అనుమతుల ఊసే లేదు

అనుమతులు లేకుండా యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుతున్నాయి. పూడిక పేరుతో చెరువులను లోతుగా తవ్వి అక్కడ మట్టి ని తొలగిస్తున్నారు. కంతేరు గ్రామంలో సుమారు మూడు ఎకరాల చెరువు గట్టు నుంచి సుమారు పది అడుగుల మేర లోతు మట్టిని తవ్వుతున్నారు. కొత్తపాడు సరిహద్దు ఇరగవరం గ్రామంలో సుమారు ఎకరం చెరువును పూడ్చి వేయడం జరిగింది. దాని గట్టు మీద ఉన్న సుమారు ఇరవై కొబ్బరి చెట్లు తొలగించారు. ఎక్కడా కూడా ఫిషరీష్, రెవెన్యూ అధికారులు అనుమతులు తీసుకోలేదు. చెరువులు పూడ్చడానికి, తవ్వడానికి ఫిషరీష్ అధికారుల అనుమతులు తప్పనిసరి. కానీ అది ఎక్కడా జరగడం లేదు. ట్రాక్టర్లు, లారీతో మట్టి తరలించడం వల్ల రోడ్లు సైతం పాడైపోతుండడంతో గ్రామాల్లో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇరగవరం మండలం నుంచి మట్టిని తణుకు, పెనుగొండ, పెనుమంట్ర, ఆలయూరు, ఇరగవరం గ్రామాల్లో లేఅవుట్లు పూడ్చడానికి తరలిస్తున్నా అక్కడ లేఅవుట్లు పూడ్చడానికి ఎకరాకు రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు అర్జిస్తున్నారు. దీంతో మట్టి వ్యాపారులు కోట్లు సంపాదిస్తున్నారు. దీని కోసం రైతులకు వేలల్లో డబ్బులు ఇస్తున్నారు. అధికారులు వారికి అన్ని విధాలుగా సహకరిస్తున్నందుకు వారికి లక్షల్లో ముడుపులు అప్పజెప్పుతున్నారు అని రెవెన్యూ అధికారులు మీద ఆరోపణలు వినిపిస్తున్నాయి. హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా ద్విచక్ర వాహనం నడిపే వారికి రూల్స్ చెప్పి జరిమానా విధించే పోలీసులు, ఆర్‌టీవో అధికారులు లైసెన్సులు, ధ్రువపత్రాలు లేకుండా ట్రాక్టర్లు, లారీలు విచ్చలవిడిగా తిరుగుతున్నా అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి దోపిడీకి అడ్డు కట్ట వేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

చోరీ కేసులో రూ.31.83 లక్షలు స్వాధీనం

- జగన్నాథపేటలో భారీ చోరీ కేసు ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ ప్రతాప్ శివకిషోర్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శివకిషోర్



పోలీసులు స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు

ఏలూరు టౌన్: పోలవరం మండలం జగన్నాథపేటలో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడి నుంచి చోరీ సొత్తు రూ.31.83 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ బుధవారం వివరాలు వెల్లడించారు. పోలవరం మండలం జగన్నాథపేట గ్రామానికి చెందిన పద్మనాభుని శ్రీనివాసగుప్త తన కుటుంబంతో కలిసి మే 13న తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు, నగదును అపహరించుకుపోయారు. చోరీ సొత్తు సుమారుగా రూ.33 లక్షల వరకూ ఉంటుందని బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ చోరీ కేసుపై ఎస్పీ ఆదేశాలతో పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టాయి.

ట్రంక్ పెట్టెలో దాచిన చోరీ సొత్తు

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈనెల 3న పోలవరం పోలీసులు నిందితుడు ఉసురుమర్తి గంగాజలంను తాడిపూడి లిఫ్ట్ ఇరిగేషన్ సమీపంలో అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా చోరీ చేసినట్లు అంగీకరించాడు. నిందితుడు చోరీ సొత్తు దాచిపెట్టిన ప్రదేశాన్ని చూపించగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో కొంత నగదును నిందితుడు గంగాజలం పేకాటలో పోగొట్టగా.. మిగిలిన నగదు, వస్తువులు పాత ఇంట్లో ట్రంక్ పెట్టెలో దాచిపెట్టాడు. రూ.22,12,082 విలువైన 247.16 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2,71,506 విలువైన 2.4 కిలోల వెండి వస్తువులు, రూ.7 లక్షల నగదు కలిపి మొత్తం రూ.31 లక్షల 83 వేల 588 చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఈ చోరీ కేసును ఛేదించడంలో ప్రతిభ చూపిన పోలవరం సీఐ బాలసురేష్, ఎస్సై పవన్‌కుమార్, హెచ్‌సీ కే.శ్రీనివాస్, జీవీవీఎస్ సత్యనారాయణ, కానిస్టేబుల్ జే.బాబి, కే.కోటేశ్వరరావు, మురళీకృష్ణను ఎస్పీ శివకిషోర్ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇల్లు, షాపుల వద్ద మోషన్ డిటెక్షన్ సీసీ కెమెరాల ఏర్పాటుతో చోరీలను నిరోధించే అవకాశం ఉందని చెప్పారు. విలేకరుల సమావేశంలో ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, పోలవరం డీఎస్పీ, సీఐ పాల్గొన్నారు.

సచివాలయ ఏఎన్‌ఎం కౌన్సెలింగ్‌లో రగడ

- తొలుత తమకు బదిలీ కౌన్సెలింగ్‌లంటూ సీనియర్ల పట్టు
- అర్థాంతరంగా నిలిచిపోయిన కౌన్సెలింగ్



ఏలూరు డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం వద్ద సచివాలయ ఏఎన్‌ఎంల బైఠాయింపు

ఏలూరు టౌన్: జిల్లాలోని సచివాలయాల్లో ఏఎన్‌ఎంలుగా పనిచేస్తున్న సిబ్బందిని మాతృసంస్థ వైద్య ఆరోగ్యశాఖలోకి నియామకాలు చేపట్టేందుకు నిర్వహించాల్సిన కౌన్సెలింగ్ ఆకస్మికంగా నిలుపుదల చేయడంతో ఏఎన్‌ఎంలు ఆందోళనకు దిగారు. ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆర్.మాలిని 4వ తేదీన కౌన్సెలింగ్ చేపడతామని ఉత్తర్వులు జారీ చేయడంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న సచివాలయ ఏఎన్‌ఎంలు ఏలూరులోని డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయానికి బుధవారం ఉదయం 10 గంటలకే చేరుకున్నారు. ఈ నేపథ్యంలో తమకు బదిలీ కౌన్సెలింగ్, పదోన్నతులు ఇచ్చిన అనంతరం మాత్రమే సచివాలయ ఏఎన్‌ఎంలకు కౌన్సెలింగ్ చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న సీనియర్ ఏఎన్‌ఎంలు అధికారులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో కౌన్సెలింగ్ అర్థాంతరంగా నిలిపివేశారు. దీనిపై సాయంత్రం వరకు అధికారుల నుంచి సమాధానం లేకపోవడంతో సచివాలయ ఏఎన్‌ఎంలు కార్యాలయం వద్ద బైఠాయించి ధర్నా చేపట్టారు. తమకు గత ప్రభుత్వంలో 2022లో 179 జీఓ మేరకు వైద్య ఆరోగ్యశాఖలో నియమాకాలు చేసేందుకు ఆదేశాలు జారీ చేశారని అనంతరం 2024 కూటమి ప్రభుత్వంలోనూ అక్టోబర్‌లో మరోసారి కౌన్సెలింగ్ చేపట్టి వైద్య ఆరోగ్య శాఖలో నియామకం చేసేందుకు ఉత్తర్వులు ఇచ్చారని చెబుతున్నారు. దీంతో గందరగోళ వాతావరణం నెలకొనడంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మాలిని, రెవెన్యూ అధికారులు ఈ అంశంపై ఇరువర్గాల నాయకులతో చర్చించి సానుకూలమైన చర్యలు చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బుధవారం రాత్రి 10 గంటల వరకు చర్చలు సాగుతూనే ఉన్నాయి.

కంగారులో రైలు దిగేసిన జార్ఖండ్ మహిళ



మహిళలను బంధువులకు అప్పగిస్తున్న ఏలూరు రైల్వే ఎస్సై సైమన్

ఏలూరు టౌన్: జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఒక మహిళ కంగారులో దెందులూరులో రైలుబండి దిగిపోగా, ఆమెను తిరిగి బంధువులకు అప్పగించినట్లు ఏలూరు రైల్వే ఎస్సై పీ.సైమన్ తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రం బిదండి గ్రామానికి చెందిన అనిత ముర్ము అనే మహిళ భర్త రాంలాల్‌తో కలిసి కేరళ రాష్ట్రానికి పనులు చేసుకునే నిమిత్తం ఈనెల 1వ తేదీన బొకారో ఎక్స్‌ప్రెస్ రైలులో ధన్‌బాద్ నుంచి ఎర్నాకుళం వెళుతుంది. రైలుబండి దెందులూరు సమీపానికి వచ్చేసరికి భర్త రాంలాల్ కనిపించకపోవడంతో భయంతో అనిత ముర్ము రైలు దిగిపోయింది. ఆమెను గమనించిన రైల్వే సిబ్బంది ఏలూరు రైల్వే పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి అప్పగించారు. అనంతరం రైల్వే ఎస్సై సైమన్ మహిళను వన్‌స్టాప్ సెంటర్‌లో ఉంచారు. అనంతరం మహిళ వివరాలు సేకరించి బంధువులను ఏలూరు రప్పించారు. మహిళ భర్త రాంలాల్, అన్నలు ఏలూరు రైల్వే పోలీస్‌స్టేషన్‌కు రాగా మహిళకు కౌన్సిలింగ్ ఇచ్చి భర్తకు అప్పగించారు.

నిందితుడిపై మూడు కేసులు

ఆకివీడు : బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డ నిందితుడిపై మూడు కేసులు నమోదు చేసినట్లు ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు బుధవారం చెప్పారు. కిడ్నాప్, అత్యాచారం, పోక్సో చట్టాల కింద కేసు నమోదు చేశామన్నారు. గాయాలైన నిందితుడు షేక్ మీరాకు భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నామన్నారు. సంతపేట ప్రాంతంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు వివరించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం: భీమవరం రెండో పట్టణంలోని ఓ బ్యాంకు ఉద్యోగి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇజ్రాయేల్ చెప్పారు. వివరాల ప్రకారం వీరవాసరం మండలం తోలేరుకు చెందిన ఎస్.భీమరాజు భీమవరంలో ఓ బ్యాంకులో పనిచేస్తున్నాడు. ఎప్పటిలానే ఈనెల2న బ్యాంకుకు వెళ్లాడు. మధ్యాహ్నం నుంచి బ్యాంకులో అతని ఆచూకీ లేదు. బుధవారం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు


తణుకులో శిబిరం నుంచి ప్రారంభించిన వెన్నుపోటు నిరసన ర్యాలీలో మాజీ మంత్రి కారుమూరి, పార్టీ శ్రేణులు


తణుకు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌లకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను వంచించి, మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి ఏడాది పూర్తయిన సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. తణుకు నియోజకవర్గంలోని మునిసిపాలిటీ, తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల నుంచి తరలి వచ్చిన పార్టీ శ్రేణులకు స్థానిక చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణ ప్రాంతంలో భారీగా శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరం నుంచి రాష్ట్రపతి రోడ్డు నుంచి నరేంద్ర సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. నరేంద్ర సెంటర్‌లో మాజీ మంత్రి కారుమూరి పార్టీ శ్రేణులు, ప్రజానీకాన్ని ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌లకు వినతి పత్రం అందజేశారు. ర్యాలీ ఆసాంతం చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యకర్తలు చేతిలోని వివిధ కొటేషన్‌లు ఉన్న ప్లకార్డులు ఆకర్షణగా నిలిచాయి. అమ్మ ఒడి లేదు నాన్న బుడ్డి ఇచ్చావు.. ఉచిత బస్సు అంతా తుస్సు.. బాబును నమ్ముకో ఉన్నదంతా అమ్ముకో.. సంపద సృష్టిస్తానన్నావు సొంత సంపద పెంచుకున్నావు.. మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు.. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తావ్.. నీకు రూ. 15వేలు ఏది బాబూ.. అంటూ ఏర్పాటుచేసిన ప్లకార్డులను ప్రజలు నిశితంగా పరిశీలించారు. ర్యాలీకి ఎండీయూ వాహన ఆపరేటర్లు మద్దతు పలికారు. పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, ఎంపీపీలు రుద్రా ధనరాజు, కొప్పిశెట్టి మంగతాయారు, తణుకు, అత్తిలి, ఇరగవరం మండల అధ్యక్షులు వెంకటరామన్న, పైబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, వడ్లూరి సీతారాం, యిండుగపల్లి బలరామకృష్ణ, జల్లూరి జగదీష్, మల్లిరెడ్డి నాగార్జున, సబ్బితి రాజేష్, పొట్ల సురేష్, జంగం ఆనంద్‌కుమార్, మెహర్ అన్సారీ, ఉండవల్లి జానకి, నత్తా కృష్ణవేణి, నూకల కనకదుర్గ, మెట్ల కిరణ్మయి, కాకర్ల విశాలాక్షి, ఝాన్సీ లారెన్స్, బెజ్జవరపు హేమశ్రీ, బుద్ధరాతి భరణిప్రసాద్, కంకటాల సతీష్, కారుమంచి యోహాన్, బుడితి సుజన్‌కుమార్, కోట నాగేశ్వరరావు, షేక్ ఫహీమా, ఫణీంద్రకుమార్ వీరమల్లు, పెనుమాక రాజేష్, పంపన అంజిబాబు, నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుది అవినీతి పాలన

- కానరాని సంక్షేమం.. అక్కరకు రాని సాయం
- సూపర్ సిక్స్‌లో ఒక్క హామీనీ నెరవేర్చని వైనం
- మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


తాడేపల్లిగూడెంలో ర్యాలీలో పాల్గొన్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : మామకే కాదు ప్రజలను వెన్నుపోటు పొడిచిన పోటుగాడు చంద్రబాబునాయుడని మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఆదేశాలను అనుసరించి వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని బుధవారం మాజీ మంత్రి కొట్టు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ 2024 ఎన్నికల సమయంలో 143 హామీలతో అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయినా ఒక్క హామీని అమలు చేయకపోవడం చంద్రబాబు అవినీతి పాలనకు నిదర్శనమన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రూ.1.51 లక్షల కోట్లుతోపాటు ఈనెలలో మరో రూ.7వేల కోట్లు రుణం తీసుకువచ్చిన అసమర్థుడన్నారు. తల్లి వందనం, స్త్రీ శక్తి, మహిళలకు ఉచిత బస్సు వంటి మొత్తం 143 హామీలను గాలికి వదిలేశాడన్నారు. జగన్‌మోహనరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రాన్ని దివాళా శ్రీలంకగా చేస్తున్నాడని విమర్శించిన చంద్రబాబు ఇప్పుడు అధికారంలోకి వచ్చి అప్పుల కోసం ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడని ఆరోపించారు. రెడ్ బుక్ పాలన అంటూ ప్రవేశపెట్టి ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత 190 మంది హత్యకు గురయ్యారన్నారు. తెదేపా మహిళలు అత్యాచారాలకు గురవుతున్నారన్నారు. వీటిపై వాస్తవాలను తెలియజేయకుండా పచ్చమీడియా మాయని మచ్చలా ఉందన్నారు. తెదేపా ప్రభుత్వం అరాచకాలను రాష్ట్రంలోని కొన్ని పత్రికలు, చానళ్లు మాత్రమే రాస్తున్నాయని వారిని పలు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కరెంటు చార్జీలు పెంచి ప్రజలకు భరించలేని ఆర్థిక భారాన్నిమోపిన చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు ఇప్పటి నుంచే సిద్ధమయ్యారన్నారు. కరెంటును రూ.2.90లకు కొనుగోలు చేయాల్సిన కరెంటును యూనిట్‌కు రూ.4.60లకు కొనుగోలు చేయడం దారుణమన్నారు. వారి వాటాల కోసం ఏదైనా అంచనాలు పెంచి లాభపడటం వారికి వెన్నతోపెట్టిన విద్య అన్నారు. ఏడాదికి రూ.20వేలు ఇస్తామని రైతులను చంద్రబాబు మోసం చేశాడన్నారు. అనంతరం ఆర్‌డీఓ ఖతీబ్ కౌసర్ బానోకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. నియోజకవర్గ పరిశీలకులు పప్పుల రామారావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఏడాది పాలనకు ప్రజలు విసిగిపోయారన్నారు. కరెంటు బిల్లులు, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచి ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపారన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకులు పప్పుల రామారావు, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, జద్దు హరిబాబు, ముప్పిడి సంపత్‌కుమార్, కైకాల శ్రీనివాస్, తగరంపూడి మరళీ, సిర్రాపు శాంతకుమార్, సగరం ప్రసాద్, అరామిల్లి రవి, కొవ్వూరి విజయభాస్కర రెడ్డి, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

క్లుప్తంగా

గోగులమ్మకు విశేష పూజలు


అమ్మవారి పూరిగుడిసె వద్ద ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక కడకట్ల 32వ వార్డులో గోగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలలో భాగంగా బుధవారం ఆలయం వద్ద, అమ్మవారి పూరిగుడిసె వద్ద విశేష పూజలు వైభవంగా జరిగాయి. అమ్మవారి పుట్టింటి, అత్తింటి వారి నుంచి నైవేథ్యాలు సమర్పించారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ అలంకరణలు గావించారు. సాయంత్రం అజయ్ ట్రాక్ సింగింగ్ వారిచే సినీ ఆర్కెస్ట్రా జరిగింది. సేవా సమితి కమిటీ నిర్వాహకులు రామిశెట్టి సురేష్ పర్యవేక్షించారు. మహిళలు, యువత, పిల్లలు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గోపాలకృష్ణకు కారుమూరి పరామర్శ


దువ్వలో గోపాలకృష్ణతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: తణుకు మండలం దువ్వ గ్రామ పార్టీ అధ్యక్షుడు శిరిగిశెట్టి గోపాలకృష్ణ తండ్రి వెంకటేశ్వరరావును బుధవారం మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో దువ్వ గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, ఉప సర్పంచ్ కడియం వీరబాబు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పోలవల్లి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ


తాడేపల్లిగూడెం ఆర్టీసీ బస్టాండ్ వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. తెన్నేటీ స్టూడియో నిర్వాహకుడు తెన్నేటి విక్రాంత్ సౌజన్యంతో మజ్జిగ పంపిణీ చేసినట్లు ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగాధర్ తెలిపారు. రోహిణి కార్తె ఎండలు తీవ్రంగా ఉండటంతో ఇటువంటి చలివేంద్రాల ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇటువంటి చలివేంద్రాలను ప్రజలు, పాదచారులు వినియోగించుకోవాలన్నారు. అసోసియేషన్ సభ్యులు భాను, పాల్గొన్నారు.

మాధవరంలో హోమాలు


మాధవరం గ్రామంలో ప్రతిష్ఠిత విగ్రహాలకు అధివాసాలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం గ్రామంలో పునఃనిర్మించిన కంచి కామాక్షి, శ్రీకామేశ్వరస్వామి వారి ఆలయం వద్ద విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా బుధవారం హోమాలు నిర్వహించారు. ఆలయ కమిటి చైర్‌పర్సన్ సుభాషిణి పర్యవేక్షణలో ధాన్యాధివాసం, క్షీరాధివాసం, జలాధివాసం, పంచశయ్యాధివాసం ఇత్యాధి అధివాసాలను నిర్వహించారు. వాడపల్లి అనంత పద్మనాభాచార్యులు బ్రహ్మత్వంలో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అల్లూరు సత్యనారాయణ ఆశయ సాధనకు కృషి చేద్దాం


అల్లూరు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): కామ్రేడ్ అల్లూరు సత్యనారాయణ ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అల్లూరు సత్యనారాయణ 11వ వర్ధంతి సభ స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో నాయకులు సత్తికొండ రామిరెడ్డి అధ్యక్షతన జరిగింది. అల్లూరు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పించారు. పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో అల్లూరు ఒకరన్నారు. కార్మికవర్గ సమస్యలపై అలుపెరగని పోరాటాలు ఎన్నో చేశారన్నారు. వర్ధంతి సభకు శిద్దిరెడ్డి శేషుబాబు, చిట్టి ప్రసాద్, నరమాల కృష్ణ, వెదుళ్ళ రాము, గంటల అప్పారావు, పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బంగారుగూడెంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్


బంగారుగూడెం గ్రామంలో జరిగిన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో మాట్లాడుతున్న వక్తలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని బంగారుగూడెం గ్రామంలో బుధవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రామన్నగూడెం వేంకటేశ్వర పశువైద్యవిద్య కళాశాల ప్రధానాధ్యాపకులు డాక్టర్ సామంత జంతువులలో యాంటిమైక్రోబియల్ రెసిస్టెన్స్, సేంద్రియ పాల ఉత్పత్తి అనే అంశంపై రైతాంగానికి తెలియజేశారు. అలాగే, ఆయిల్ పామ్‌లో అంతర సాగుపై డాక్టర్ రామచంద్రుడు, మత్స్యసాగులో మెరుగైన నిర్వహణ పద్ధతులుపై డాక్టర్ దేవి వరప్రసాద్‌రెడ్డి, పశువులకు అనుకూలమైన మేత విధానాలు – టీకాలు అనే అంశంపై డాక్టర్ విజయ్, ౩ఎఫ్ ఇండస్ట్రీస్ పథకాలు, సేవల గురించి సూర్యారావు రైతులకు వివరించారు. పశువైద్యాధికారి డాక్టర్ రమాదేవి, వీహెచ్ఏ గౌతమి, ఏహెచ్ఏ, రైతులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అత్తిలి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం జరుగుతుందని ఎంపీడీవో పి శామ్యూల్ తెలిపారు. ఎంపీపీ మక్కా సూర్యనారాయణ అధ్యక్షతన జరిగే ఈసమావేశానికి ప్రజా ప్రతినిధులు, మండలస్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

దోమకాటుతో వ్యాధుల ముప్పు

పాలకొల్లు సెంట్రల్: చిన్న దోమకాటుతో పెద్ద వ్యాధులతో ముప్పు వాటిల్లుతుందని డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ తెలిపారు. బుధవారం మలేరియా మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మలేరియా వ్యాప్తిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దోమ కాటుకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలు పెరగకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వలు ఎక్కువగా ఉంటే దోమలు పెరుగుతాయన్నారు. ఎక్కడికక్కడ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమ కాటుకు మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, బోదవ్యాధి, మెదడువాపు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది. ఎవరికైనా జ్వరం, చలి, ఒంటి నొప్పులు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు


వేసవి శిక్షణ శిబిరంలో కోపల్లె శ్రీనివాస్‌చే రాఘవయ్య మాస్టార్ వేషధారణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో గ్రేడ్ -1 శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం బుధవారం జరిగింది. రిసోర్స్‌పర్సన్స్‌గా హాజరైన ప్రత్తి వీరాస్వామిచే అక్బర్, బీర్బల్ కథలు, బొమ్మల రహస్యాలు, కోపల్లె శ్రీనివాస్‌చే రాఘవయ్య మాస్టార్ వేషధారణ గావించారు. పూర్వపు రోజులలో స్థితిగతులు, ఆచారాలు, తల్లిదండ్రులు, గురువుల పట్ల ఎలా ప్రవర్తించాలి తదితర అంశాలను పిల్లలకు తెలిపారు. వి.జనార్ధనరావుచే పొడుపు కథలు, చమత్కార మాటలు, జి.బాపయ్యశర్మలచే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎలా చేరుకోవాలి తదితర అంశాలను వెల్లడించారు. పుష్పలతచే యోగా, వ్యాయమాలు నేర్పించారు. గ్రంథాలయాధికారి పి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

అలరించిన భరతనాట్యం


అత్తిలి శాఖా గ్రంథాలయంలో చిన్నారి భరతనాట్యం చేస్తున్న దృశ్యం

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు నీతి కథలు చెప్పించడం, చదివించడం, పుస్తక సమీక్ష చేయించారు. రిసోర్సుపర్సన్ కె కోమలి విద్యార్థులకు ఇంగ్లీషులో మాట్లాడించడంపై శిక్షణ ఇచ్చారు. చిన్నారి కాకర్ల సహస్ర నందితశ్రీవల్లి ప్రదర్శించిన భరతనాట్యం ఆహూతులను అలరించింది. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, ఎల్ రాణి, కె విశ్వేశ్వరరావు, పి వెంకటేశ్వరరావు, వై ప్రసాద్, గంధం శేషవేంద్రరావు, ఎం శ్రీదేవి, యశస్విని పాల్గొన్నారు.

మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలి


తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న పుష్పకుమారి

తణుకు అర్బన్: అణచివేత, లింగ వివక్షతలకు వ్యతిరేకంగా సమానత్వ సాధన, మహిళా సాధికారత లక్ష్యంగా 70 ఏళ్లపాటు నిర్విరామంగా పోరాడుతూ ఎన్నో మహిళా చట్టాలు, హక్కులు సాధించిన ఘనత భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు)కే దక్కుతుందని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి అన్నారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యు 70వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం తణుకులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ సీడ్స్ వద్ద మహిళా సమాఖ్య పతాకాన్ని పుష్పకుమారి ఆవిష్కరించి మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఎన్ఎఫ్ఐడబ్ల్యు పోరాట ఫలితమేనని, భారత జాతీయ మహిళా సమాఖ్య జాతీయ నేత, సీపీఐ ఎంపీ గీతాముఖర్జీ తొలిసారి మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. 25 ఏళ్ల సుదీర్ఘ పోరాటాల తర్వాత మహిళా బిల్లు ఆమోదానికి నోచుకుందన్నారు. మహిళా బిల్లు ఆమోదించిన ఎన్డీఏ ప్రభుత్వం తక్షణ అమలుకు పూనుకోకపోవడం విచారకరమన్నారు. సమాఖ్య తణుకు ఏరియా అధ్యక్షురాలు సావారపు దేవి, కార్యదర్శి వలవల అరుణకుమారి, పిండి సత్యవతి, లక్కోజు రాజ్యలక్ష్మి, ఎస్ తేజశ్రీ, రామలక్ష్మి, పట్టపు కృష్ణవేణి, కవల మంగతాయారు, ఎస్.పార్వతి పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని పలువురు మహిళలు పేర్కొన్నారు. సీపీఐ కపర్ధి భవనంలో మహిళా సమైఖ్య 70వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం జెండా ఆవిష్కరణ చేశారు. వక్తలు మాట్లాడుతూ దిశ చట్టం, నిర్భయ చట్టం, మహిళా పోలీసులు ఉన్నప్పటికి, మహిళలకు ఎన్నో అనుకూలమైన చట్టాలు వచ్చినా, దాడులను అరికట్టలేకపోతున్నారని వాపోయారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమ్మవడి, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు, తదితర సూపర్ సిక్స్‌లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. వి.మేరి, ఎన్.నాగలక్ష్మి, కె.లక్ష్మి, ఎన్.వరలక్ష్మి, పి.శ్యామల పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

ఆకివీడు: కనిపించే ప్రత్యక్ష దైవం అమ్మ అని విద్యార్థులు తల్లిదండ్రులు చూపిన బాటలో నడుచుకోవాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు కాకర్ల రాజరాజేశ్వరి పిలుపునిచ్చారు. స్థానిక శాఖాగ్రంథాలయంలో వేసవి సెలవులు సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బుధవారం బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మే ప్రథమ గురువు, దైవం అన్నారు. విద్యార్థులు అమ్మ చెప్పిన మాటలను విని, శ్రద్ధగా చదువుకోవాలన్నారు. ఉదయం 4,5 గంటలకే నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకుని చదువుకోవాలన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


నన్నయ్య వర్సిటీ ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమంలో విద్యార్థులు

తాడేపల్లిగూడెం: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని పలువురు వక్తలు తెలిపారు. బుధవారం స్థానిక నన్నయ్య వర్సిటీ ప్రాంగణంలో యోగాంధ్ర వేడుకలు జరిగాయి. యోగా వల్ల మానసిక శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని ప్రిన్సిపాల్ టి.అశోక్ అన్నారు. ఎన్ఎస్ఎస్.ప్రోగ్రాం ఆఫీసర్ రాజు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు యోగాసనాలు వేశారు.

యువతకు కూటమి మొండిచేయి

- నిరుద్యోగులకు ఏది ఆసరా?
- నిరుద్యోగ భృతి.. జాబ్ క్యాలెండర్ ఎక్కడ
- గందరగోళంలో యువత



తణుకులో ఐలవ్ తణుకు కట్టడం


తణుకులో చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల

తణుకు అర్బన్ : వెన్నుపోటు రాజకీయంతో కూటమి ప్రభుత్వం యువతకు మొండిచేయి చూపించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే యువతకు అత్యంత ప్రాధాన్యతనిస్తానని హామీలు గుప్పించి ఏడు దాటాక తెప్పతగలేసిందంటూ యువత దుమ్మెత్తిపోస్తున్నారు. నిరుద్యోగ భృతి అన్నారు అదిలేదని, జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ అని ఢంకాలు వాయించి దగా చేశారంటూ నిరు ద్యోగ యువత ఆరోపిస్తున్నారు. లక్షమందికిపైగా ఉన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్న ఆప్కాస్‌ను ఎత్తేస్తున్నారంటూ కాంట్రాక్ట్ ఉద్యోగులు నిరసనలు చేస్తున్నారు. ఇప్పటికే చదువులు పూర్తయినా ఉద్యోగాలు లేక అల్లాడే పరిస్థితి దాపురించిందంటూ నిరుద్యోగులు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతకు 6.47 లక్షల ఉద్యోగాలు ఇచ్చిందని ఆప్కాస్ ద్వారా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కలిగించారని, ప్రతినెలా ఒకటవతేదీన జీతాలు పడేవని రానున్న రోజుల్లో ఈ కూటమి ప్రభుత్వం ఏరకమైన ఇబ్బందులకు గురిచేస్తుందోనని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు భయపడుతున్నారు.

గతమెంతో ఘనం

గత జగన్ ప్రభుత్వ హయాంలో విద్యారంగానికి ఎంతో ప్రాధాన్యతనిచ్చి ఎంత చదివితే అంత ఉచితమనే విధానాన్ని అమలుచేసి యువత ఉపాధి అందుకునే స్థాయికి ప్రభుత్వం తీసుకువెళ్లింది. అదే విధంగా ప్రజలకు సత్వర సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో సచివాలయాలు ఏర్పాటుచేసి సెక్రటరీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చి వేలాది మందికి ఉద్యోగాలు కల్పించారు. అంతేకాకుండా సచివాలయ వ్యవస్థ ఇంటి గుమ్మంలోకి వెళ్లడంతోపాటు నిరుద్యోగులకు సేవ, ఉపాధి కల్పించే విధంగా వలంటీరు విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీరును ఏర్పాటుచేసి ప్రజలకు మంచి సేవలు చేస్తూనే వలంటీర్లకు ఉపాధి కల్పించింది. దీంతోపాటు ప్రైవేటు మద్యం దుకాణాల విధానాన్ని రద్దుచేసి ప్రభుత్వ మద్యం దుకాణాలు ఏర్పాటుచేసి వేలాదిమంది యువతకు సూపర్‌వైజర్లు, అసిస్టెంట్, వృద్ధులకు వాచ్‌మెన్ పోస్టుల ద్వారా ఉపాధి కల్పించారు. దీంతో ఉద్యోగాల కల్పనతో నిరుద్యోగం అనే ఊసేలేకుండా పాలన జరిగింది. కానీ నేడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కొన్ని ఉద్యోగాల తొలగింపుతో పాటు ఇచ్చిన హామీల ప్రకారం జాబ్ క్యాలెండర్ ప్రకటించకపోవడంతో నిరుద్యోగులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూపులు చూస్తున్నారు.